క్లుప్తంగా

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



స్టూడెంట్ కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓలు

జి.సిగడాం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిట్లు చేరాయి. ఈ కిట్లలో పాఠ్య, నోట్ పుస్తకాలు, షూ, బెల్ట్ తోపాటు ఇతర సామగ్రి వచ్చాయని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వీటిని ఈ నెల 13వ తేదీ నుంచి పాఠశాలకు పంపిణీ చేస్తామన్నారు.

పీఏసీఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా



సనపల నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎం పురం పీఏసీఎస్ అధ్యక్ష పదవికి సనపల నారాయణరావు బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను అధికారులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

విద్యుత్ కాంతులతో ప్రభుత్వ కార్యాలయాలు



విద్యుత్ వెలుగుల్లో ఎంపీడీఓ కార్యాలయం

జి.సిగడాం: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఐకేపీతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీ వరకు విద్యుత్ అలంకరణలో కార్యాలయాలు ఉంటాయని అధికారుల తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: మండలంలోని కోష్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 14వ తేదీన అత్యవరస పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటన తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోష్ట, వల్లభరావుపేట, వెంకటరావుపేట, పల్లిపేట, పైడిపేట, చిల్లపేట రాజాం, రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలోని నగరప్పాలెం, బండిపాలెం, కంబాలపేట, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రమాణ స్వీకారం వీక్షణ



చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని స్క్రీన్‌లో వీక్షిస్తున్న జనం

శ్రీకాకుళం రూరల్: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రుల ప్రమాణ స్వీకారం చేసే ప్రక్రియను ప్రజలు వీక్షించేందుకు వీలుగా మండల పరిధి సింగుపురం గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో రెవెన్యూ సిబ్బంది భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రభుత్వ సిబ్బంది ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ ప్రకాశ్‌రావు, పంచాయతీ సెక్రటరీ రమేష్, పలువురు టీడీపీ నాయకులున్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

సోంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివి ఏపీ ఈఏపీ సెట్, డైట్‌సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సిబ్బంది బుధవారం అభినందించారు. అఖిల పాత్రో, నీలిమ, సమీర సాహు, బిద, విజయ, యశోద, పూజ, అంజలి బెహేరా, దీపక్, సాయిలు డైట్, ఈఏపీ సెట్ ఫలితాల్లో సత్తాచాటారు. ప్రిన్సిపాల్ మోహనరావు, అధ్యాపక సిబ్బంది వీరికి పుష్పగుచ్ఛాలతో అభినందించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజీఎంసీ రజనీ కుమారి, అధ్యాపకులు రామినాయుడు, ప్రసాద్, ప్రవీణ్, నారాయణరావు, కల్పన ఉన్నారు.

సాగునీరు అందేదెలా?

- కాలువ నిండా పిచ్చిమొక్కలు
- పేరుకుపోయిన పూడికలు
- ఆందోళనలో అన్నదాతలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో సాగునీరు అందించే ప్రధాన సాగునీటి వనరు నారాయణపురం కుడికాలువ. ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్నారు. కాలువ అస్తవ్యస్తంగా ఉంది. తక్షణ మరమ్మతులు నిర్వహించకపోతే శివారు ప్రాంతాలకు సాగునీరు అందటం సాధ్యం కాదు. ఈ కాలువ ద్వారా సంతకవిటి మండలంలో 4,221 ఎకరాలు, పొందూరులో 6,967 ఎకరాలు, ఎచ్చెర్లలో 7175 ఎకరాలు సాగవుతుంది. ఎచ్చెర్ల మండలంలో శివారు భూములు ఉండటం వల్ల ప్రత్యేక దృష్టి సారిస్తేనే నీరు చేరుతుంది. కాలువ నిండా చెట్లు, పిచ్చి మొక్కలు ఉన్నాయి. కొన్నిచోట్ల మట్టి పొరలు పేరుకుపోయింది. మదుములు, షట్టర్ల పరిస్థితి దారుణంగా ఉంది. శివారు భూములకు



నారాయణపురం కుడి కాలువ దుస్థితి

సాగునీరు వెళ్లాలంటే ప్రారంభంలో నీటి దుర్వినియోగం అరికట్టాల్సి ఉంటుంది. వర్షాలు సకాలంలో పడకపోతే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ప్రస్తుతం వర్షాలు అనుకూలిస్తే విత్తనాలు చల్లేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నారుమడులు సిద్ధం చేసుకున్నారు. సాగునీటి కాలువ మరమ్మతులపై అధికారులు ఇంతవరకు దృష్టి పెట్టలేదు. ఎచ్చెర్ల మండలంలో ఫరీదుపేట నుంచి ఓలేటి అగ్రహం వరకు 15 కిలో మీటర్ల మేర కాలువ వ్యాపించి ఉంది. మండలంలోని ఫరీదుపేట, ఇబ్రహింబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, కుశాలపురం, తోటపాలెం, పొన్నాడ, కొంగరాం, ముద్దాడ, భగీరథపురం, ధర్మవరం వంటి పంచాయతీల పరిధిలో పంట పొలాలు ఈ కాలువ ఆధారంగా సాగవుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు అత్యవసర పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



నవభారత్ సమీపంలోని కాలువలో చెట్లు



కుశాలపురం సమీపంలో కాలువలో పిచ్చి మొక్కలు



పెయ్యిలవానిపేట సమీపంలో కానరాని షట్టర్లు, శిథిలమైన సివిల్ నిర్మాణం

ముగిసిన యోగా తరగతులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పెద్దపాడు రోడ్డులోని హేపీనెస్ కేంద్రంలో ఆరు రోజులుగా జరుగుతున్న యోగా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. యోగా ప్రతిఒక్కరి జీవతంలో భాగస్వామ్యం కావాలన్నారు. నేను, నాది అనే అహమే అనేక సమస్యలకు మూలమని, ఈ అహంకారంతోనే ప్రపంచం యావత్తు దహించుకుపోతోందని అన్నారు. యోగా టీచర్ దేసూళ సురేంద్ర మాట్లాడుతూ.. మనిషి వర్తమానంలో జీవంచడం ద్వారా ఆనందంగా ఉంటారన్నారు. అనంతరం జరిగిన సత్సంగంలో చౌదరి శ్రీనివాస్, రేణుకా బృందం పాడిన పలు గీతాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ కె.ఎస్.ఎన్.మూర్తి, ఎవోఎల్ టీచర్ వారణాసి సందీప్, వలంటీర్లు వెంకటరమణ, అవినాష్, వైకుంఠరావు, కాత్యాయని, 35 మంది యోగా సాధకులు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో యోగసాధకులు

మాజీ సీఎం జగన్‌ను కలిసిన కామేశ్వరి



జగన్‌మోహన్‌రెడ్డితో కామేశ్వరి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళా నాయకురాలు టి.కామేశ్వరి తాడేపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ సూచించినట్లు కామేశ్వరి తెలిపారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కింతల మిల్లు జంక్షన్ వద్ద ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారికి బుధవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజుకావటంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

తాగునీరు వృథా



ఫరీదుపేటలో వీధి కుళాయికి ట్యాప్‌లేని దృశ్యం



బీసీ కాలనీలో వృథాగా పోతున్న తాగునీరు

ఎచ్చెర్ల క్యాంపస్: కుళాయిలకు ట్యాప్‌లు పెట్టకపోవటం వల్ల తాగునీరు వృథాగా పోతుంది. సమీకృత రక్షిత మంచి నీటి పథకం ద్వారా ఫరీదుపేట గ్రామంలో తాగునీరు అందిస్తున్నారు. వీధి కుళాయి పాయింట్లుకు ట్యాప్‌లు లేవు. బీసీ కాలనీలో సృజల ధార కింద ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. ఇక్కడ సైతం కొన్నిచోట్ల ట్యాప్‌లు లేవు.

16 నుంచి ఉమారుద్రకోటేశ్వరస్వామి వార్షిక కల్యాణాలు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో బలరామ ప్రతిష్ఠ ఆలయమైన ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి వార్షిక కళ్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న ధ్వజారోహణ, 17న శివపార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా అభిషేకాలు, సాయంత్రం సర్పవాహనంపై స్వామివారి ఊరేగింపు, అనంతరం ఆలయ మండపంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18న ఆగ్నేయ స్థాలీపాక హోమాలు, 19న ఔపాసన, 20న పండిత సత్కారం, 21న నాగావళి నదిలో త్రిశూల స్నానం కార్యక్రమాలు ఉంటాయని.. భక్తులంతా పాల్గొనాలని కోరారు.



ఉమారుద్రకోటేశ్వరస్వామి

మట్టి సేకరణపై శిక్షణ

శ్రీకాకుళం రూరల్: మట్టి సేకరణ విధానంపై మండల పరిధిలో గల వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఒకరోజు శిక్షణ జరిగింది. శిక్షణలో డివిజనల్ వ్యవసాయశాఖ ఏడీ రజనీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొలంలో పోషకాలు ఏస్థాయిలో ఉంటాయో మట్టి సేకరణ చేసి పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. నేల స్వభావాన్నిబట్టి పంటలు వేసుకోవాలన్నారు. వరి విత్తనాలు మొలక వచ్చే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఏవో ఉషాకుమారి, ఏఈవో ఎరుకునాయుడు ఉన్నారు.



శిక్షణ ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

శ్రీకాకుళం: నిబద్ధతతో పనిచేసి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని రిమ్స్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.మీచల్ అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రిమ్స్ కళాశాల విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం ర్యాలీ చేపట్టారు. బాలకార్మిక వ్యవస్థతో కలిగే నష్టాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.ఉషాపన్నగవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె.పద్మావతి, ఏపీవో పి.సునీత, బీఎస్సీ నర్సింగ్ వలంటీర్లు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

అయ్యప్పస్వామికి అభిషేకాలు



పూజలందుకున్న అయ్యప్పస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకర నారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

లక్ష్మీగణపతికి అభిషేకాలు

బలగలోని శ్రీబాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో లక్ష్మీ గణపతి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్‌గురూజీ ఆధ్వర్యంలో స్వామికి పూజలు, అలంకరణలు చేశారు.



అభిషేకాలు అందుకున్న లక్ష్మీగణపతిస్వామి

మున్సిపల్ వర్కర్స్ దాతృత్వం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధి కిల్లిపాలెం–2 లో ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న కళ్యాణి సుహాసిని కుమార్తె యశోద అనారోగ్యంతో బాధపడుతోంది. ఈమెకు అండగా నిలిచేందుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ముందుకు వచ్చింది. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమితి నాయకులు టి.తిరుపతిరావు, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, సహాయ కార్యదర్శి పార్థసారథి, డి.గణేష్, ముఖ్య సలహాదారు నల్లపిల్లి బాబూరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మణి, సోషల్ మీడియా ప్రతినిధి ఆరుగురు రమణ, రామచంద్ర, సోగ్గాడు సూర్యకళ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

జలుమూరు: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలుమూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. చల్లవానిపేట పంచాయతీలోని వైఎస్సార్ కాలనీలో మలేరియా మాసోత్సవాలు సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. వారంలో ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తలనొప్పి, జ్వరంతో పాటు కాళ్ల పీకులు, వంటపై ఎర్రటి దద్దుర్లు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వై.కె.శ్రీనివాసరావు హెచ్ఎస్ చిన్న రాజులు, హెచ్ఏ చిన్నారావు, సిబ్బంది సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఫారం-16 అందుబాటులోకి తీసుకురావాలి

ఆమదాలవలస: ఆమదాలవలస సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలో గల పెన్షనర్లకు ఫారం–16 అందుబాటులోకి తేవాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆమదాలవలస సబ్‌ట్రెజరీ కార్యాలయంలో సబ్‌ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ఫారం –16ను ఇప్పటినుంచి అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ నెల 15 నుంచి జూలై 31వ తేదీ లోగా పెన్షనరులందరూ ఈ ఫైలింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు, కార్యవర్గ సభ్యుడు హెచ్.వి.సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కొత్తూరు: రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని ఉపాధి వేతనదారులకు ఎంపీడీఓ కె.త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని మూర్తిమానుగూడ, పిల్లగూడ గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన రైతుల కొండ పోడు భూముల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. వేతనదారుల హాజరు తనిఖీ చేశారు. కొండ పైనుంచి వచ్చే వర్షం నీరు నిల్వ ఉండేలా పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. ప్రతి గిరిజన వేతనదారుడు ఉపాధి పనులు వినియోగించుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మూర్తిమానుగడలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

పొందూరు: ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేయాలని పొందూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పి.జ్యోత్స్న అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. వ్యర్థాలను సేకరించడం, వేరు చేయడం, శుద్ధి చేయడం వంటి ప్రక్రియలు సరైన పద్ధతిలో చేయాలని సూచించారు. డంపింగ్ యార్డుల నిర్వహణలో లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణలో లోపాలు వల్లే అంటు వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ప్లాస్టిక్‌తో ముప్పు పొంచి ఉందని, వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సదస్సులో సర్పంచ్ రేగిడి లక్ష్మి, లాయర్లు వై.వి.బ్రహ్మాజీ, కె.కృష్ణారావు, ఎం.రాము, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.